
17—12—80




# కాడి క్రింద మెడ

— డాక్టర్ పి. వి. రమణ

**విరామం** లేకుండా, స్వలాభం కోరకుండా ఒకదాన్నొకటి పరామర్శించుకొంటూ పరిభ్రమణ సాగిస్తూనే ఉన్నాయి గోళాలు—ఎన్నాళ్ళనుండో. వాటికి ఆత్మలు లేవు; ఆత్మీయతలు ఉన్నాయి. రక్త బంధాలు లేవు; విడిచి ఉండలేని అదృశ్య అనుబంధాలు ఉన్నాయి. కక్షలూ, కావేషాలూ, వర్గాలూ' వైరుధ్యాలూ—ఆ ప్రశ్నే ఉదయించదు, వాటి మధ్య. అందుకే వాటి భవిష్యత్తుకు భరత వాక్యం లేదు. వాటి అస్తిత్వాలకు అస్తమయం రాదు. కాలం కదిలిపోతున్నా, తరాలు తరలిపోతున్నా వాటి మనుగడను ప్రశ్నిస్తూ ఏ మంచు కుడ్యంలా తల ఎత్తినది లేదు. కానీ, ఈ భూగోళంలో నరుడనే వాడు మొలక ఎత్తించిన వర్గ విభేద విష బీజాలు పెరిగి పెరిగి, స్వార్థంలో మరిగి మరిగి మానవ జాతినే పట్టి పీడిస్తున్న వర్తమాన కాలంలోని సంఘటనా పరంపరల్లో ఇదీ ఒకటి.

బాచిగాడు ఉదయం నుండీ దిగంత మంత ఆశతో, అద్దంలో చంద్రుణ్ణే అందుకోవాలన్నంత ఆరాటంతో చతికిల బడ్డాడు కాలువ గట్టున. వాడి కళ్ళ ముందే ఒక పిళ్ళ పాము కోరమీనును నోట కరుచుకొంది. దూరాన ఒంటి కాలి జపంలో మునిగి తేలుతున్న కొంగ జపాన్ని పక్కకు పెట్టి, క్షణంలో నీటిలోకి అడుగంటా ముక్కు గుచ్చి, ఒక జీవిని పట్టి, మెడ పైకెత్తి నోటిలో వేసుకొంది. బాచిగాడ్ని గాలి మట్లాగే ఉంది, సందడి లేకుండా. కళ్ళముందే రైలు తప్పిపోయిన ప్రయాణికుడులా దిగాలు పడి పోయింది వాడి ముఖం. "ఈ రోగం ఇక తగ్గదురా, అబ్బీ!" అన్న డాక్టరు మాటలు విని కవురు గమ్మిన దీర్ఘ రోగి ముఖంలా మారింది ఆకాశం. తన ఆగర్భ శత్రువుకు లాటరీలో అమాంతంగా లక్ష రూపాయలు వస్తే ఎదుటివాడు పడే వేదనలా ఉంది ప్రకృతి.

బాచిగాడికి ఒళ్ళు మండింది. గాలాన్ని పైకి గుంజి పిళ్ళమీదికి వేసి బాదాడు. జాలి జాలిగా నీరు గిల గిల లాడింది. అటూ, ఇటూ సర్దుకొని మళ్ళీ గొంతు క్కూర్చున్నాడు. ఆవరిస్తున్న నిరాశలో ఒకింత ఆశను కూడగట్టుకున్నాడు. ఆ నీటిలో అందే ఆహారం కోసమై వాడి పంచ ప్రాణాలూ ఎదురు చూపులు చూస్తున్నాయి. వాడి ఆశ ఫలించింది. గాలం బుడుంగున నీటిలోకి మునిగింది. గాలాన్ని పైకి లాగి, పట్టునుండి ఆ ప్రాణిని విడిపించాడు. "దొంగ ముండ" అని మురిపెంగా ముద్దు పెట్టుకొన్నాడు. ప్రాణమంత భద్రంగా దాన్ని బుట్టలో దాచుకొన్నాడు. బాచిగాడి ఆరాటమంతా దీపావళి పండుగ గూర్చే. ఆ చేపను పలికినంత ధరకు అమ్మి, ఆ డబ్బుతో దీపావళి సామాను కొనుక్కోవాలన్నదే వాడి తపన. ఉదయం నుండీ వాడు సాగించిన తపస్సు ఇందుకే.

—

రెక్కలు గట్టుకొని ఇంటిముందు వాలాడు బాచిగాడు. బుట్టను భద్రంగా ఒక మూల పెట్టాడు. "ఓ లమ్మో! గిప్పుడే వత్తా. ఈ సేప ముండకానాను జర సూత్తుండవే" అంటూ తల్లికి చెపుతూనే బయటికి పరుగెత్తాడు. ఎన్నో ఏండ్ల తపస్సుకు ఫలితంగా, కోరుకొన్న వరం దొరికినంత తన్మయంగా ఉంది వాడికి. తలచింది సర్వం జయించుకు వచ్చినంత సంబరంగానూ ఉంది బాచిగాడికి. రామిగాడూ, తనూ కలిసి ఆ చేపను అమ్మివేయాలి. 'ఆడి కుండే సొరవ నాకు లేదు' అనుకొంటూ తనను తాను కించపరుచు కొన్నాడు బాచిగాడు.

రామిగాడు ఇంటికాడ లేడు. బాచిగాడి మనసు క్షణకాలం బావురుమంది. వీధిలో ఉంటాడన్న ఆశతో అటు వేపే వెళ్ళాడు. ఆత్రతగా వీధులన్నీ కలియ జూశాడు. పట్టి పట్టి చూశాడు. రామిగాడి జాడే లేదు. దుకాణాల్లో ఉన్న దీపావళి సరుకును చూస్తూంటే బాచిగాడి కళ్ళు చోద్యంగా విప్పుకున్నాయి. మనసు రెపరెప లాడింది. 'పటేల్ దొర కొడుకు, పట్వారీ దొర కొడుకు గివుంటివన్నీ కొనుంటరు. ఆల్లు 'పెద్దోర్లు' అనుకుంటూంటే వాడి లేత మనసు కుత కుత లాడింది. ఆ దుకాణాల వైపే ఆశగా, అబగా చూసి చూసి తిరిగి రామిగాడి ఇంటికి బయలుదేరాడు బాచిగాడు. రామిగా డింకా రాలే.

"పొద్దుగాల పోయిండు. ఎటు పొయ్యిండో నాకు సుతా చెప్పలే. ఏ యాది పంట్ల తిరుగుతాండో! ఎప్పటి కొస్తడో మరి?" రామిగాడి తల్లి చెప్పింది.

"నా నొచ్చిన్నని చెప్పలా. ఆడొచ్చినంక నాకాడికి తోలు" అంటూ వెనుదిరిగాడు బాచిగాడు.

ఇంటికి వచ్చిన బాచిగాడికి ఒక్కసారిగా గుండె జారి క్రింద పడ్డట్టు అయింది. పొరలు పొరలుగా మనసు చీలినట్టు అయింది. దిగులుతో, భయంతో నరాలు ఇంకిపోయినట్టు అయింది. వాడు బుట్టలో భద్రంగా ఉంచిన చేప లేదు.

"నానెంత సెప్తున్నా ఇనుకోకుండ నీ బాబు వచ్చి నోడుగా సేపను సంజాకు తిన్నడురా." జాలిగా బాచిగాడిని చూస్తూ అంది తల్లి. బాచిగాడి మనసు బుస బుసప్పుంది. ఈ ప్రపంచమంతా నమిలి మింగెయ్యాలన్నంత కోపం వచ్చింది వాడికి. కంటి ముందు కనుపించే ప్రతి దాన్నీ కాళ్ళతో తన్నివేయాలనిపించింది. అసహ్యంగా, అసహాయంగా తండ్రి వైపు చూశాడు. కడుపు పట్టినంత సరకూ తాగి, అందినంతవరకూ తిని గురకలు పెట్టి నిద్ర పోతున్నాడు తండ్రి. గాలి పీల్చినప్పుడు, విడిచినప్పుడు పైకీ, క్రిందికీ కదలాడే తండ్రి పొట్ట వైపే చూస్తూండిపోయాడు. ఆ పొట్టలో కూరుకుపోయి, తనను తీసుకుపొమ్మని ఆ చేప గోల చేస్తున్నట్లుగా అనిపించింది బాచిగాడికి. దిగులుగా, దీనంగా తండ్రి వైపు చూస్తూ, 'నా కదృష్టం లేదు. టపాసులు దొరబాబులకే' అని సణుక్కొంటూ బయటికి వచ్చాడు బాచిగాడు. ఉదయం నుండీ పడ్డ శ్రమ, కన్న కలలు, దుకాణంలో టపాసులు అన్నీగుర్తుకొచ్చి బావురుమన్నాడు బాచిగాడు. పిండుకొని పోయే బాధతో పట్వారీ దొర ఇంటి ముందుకు వచ్చాడు. ఎత్తైన ప్రహరీ. ఆ ప్రహరీకి మధ్యలో చువ్వల గేటు. చువ్వల సందుల్లో నుండి లోనికి చూశాడు బాచిగాడు. వాడి కళ్ళలో విలువ కట్టలేని వెలుగు, అవధులెరుగని ఆశ. ఏదో వింత సృష్టిని చూస్తున్నట్లు మిడిగుడ్లు పెట్టుకొని చూస్తూండిపోయాడు. ప్రాకారం లోపల దీపావళి సామాను ఎండకు ఆరబెట్టి ఉంది. బాచిగాడి కాళ్ళలో, చేతుల్లో అనంతమైన శక్తి ఏదో ప్రవేశించినట్లు అయింది. ఆ సామాను కోసం ఆ గేటునే కాదు, అటువంటి వంద గేట్లనైనా విరగ్గొట్టి పోయేటంతటి తెగింపు క్షణకాలం వాడిని ఆవహించింది. ఉద్రేకంతో వూగిపోయాడు ఒక లిప్తకాలం బాచిగాడు. ఆ వెంటనే ఆ ఉద్రేకం సడలిపోయింది. నీరసం నెత్తికి ఎక్కింది. నరాల్లో నీరసం. ఆకలితో అలమటించి పోయే వ్యక్తి ముందు పంచభక్ష్య పరమాన్నాలతో నింపిన పళ్ళాలు పెట్టి, ఆ పైన అవి నీ కోసం కాదు బాబూ అంటే ఆ వ్యక్తిని కమ్మివేసే నిరాశ లాంటిదే బాచిగాడి దీను.

"పట్వారీ దొర కొడుక్కి గిన్ని గిన్ని మందు టపాసులు. ఓలయ్యో!" గొణుక్కున్నాడు బాచిగాడు. తనను తాను చీదరించుకొన్నాడు. "థూ నీయవ్వ!" అని తండ్రిని తిట్టిపోశాడు. 'పటేల్దొర కొడుకూ గిన్నీ కొనుంటడు' అనుకొన్న బాచిగాడి మనసులో వాటిని చూడాలన్న ఆరాటం సుడిగాలిలా కమ్ముకు వచ్చింది. ఆ సుడిగాలి వాడిని ఒక్క విసురు విసిరి పటేల్ దొర ఇంటిముందు ఎత్తి కుదేసింది.

"అడకంటే ఈడనే జర జాస్తున్నై." పటేల్ దొర ఇంటి ముందు ఎండబెట్టిన దీపావళి సరుకుల్ని చూసి గొణుక్కున్నాడు బాచిగాడు. వాడికి తన స్థితి గుర్తుకు వచ్చింది. తన తండ్రి క్రూరత్వం కళ్ళముందు మెదిలింది. ఆ చేపను మింగి తన ఆశల్ని కూలదోసిన రాక్షసుడులా కనుపించాడు తండ్రి.

"పొద్దుగాల పట్టిన చేపను రామిగాడింటికే కొంచుకపోతే అయ్య సూడకనే పోవు." చింతించాడు బాచిగాడు.

ఉన్నట్లుండి సన్నగా తుంపర మొదలైంది. నలిగి నానిన నీలం చీరలా ఉంది ఆకాశం. చినుకులు పైబడ్డ బాచిగాడిలో చిత్రమైన కోరిక. చూస్తూన్నంతలోనే ఆ కోరికకు కోరలు వచ్చినాయి. కళ్ళలో కదలాడే ఈర్ష్యాసూయల ఛాయలు. క్రిందటి ఏడు సరిగ్గా దీపావళి నాడే కురిసిన పెద్ద వర్షం గుర్తుకు వచ్చింది వాడికి. టపాసులు కాల్చుకొనే అవకాశం ఎవరికీ లేకుండా పోయింది అప్పుడు. ఇప్పుడు మళ్ళీ చిన్న చిన్న చినుకులు. బాచిగాడి మనసులో గలగల మనే స్పర్ధపు సందడి.

"ఈ ఏడు సుతా వాన రావాలి. పట్వారీ దొర కొడుకు, పటేల్ దొర కొడుకు అల్ల పటాక్లో దీపాలి టపాసులు ఎల్గించకుండానే వాన




"కర్కశంగా, గరుకుగాఉండే
పళ్ళపొడులు మీ పళ్ళకు,
చిగుళ్ళకు
హానికలిగించవచ్చు..."

కోల్గేట్ టూత్ పౌడర్‌తో మీ చిగుళ్ళను,
చెడుశ్వాసను కూడా అరికట్టండి
పళ్ళను
కాపాడుకోండి.






కోల్గేట్ టూత్ పౌడర్ ఎంతో మెత్తగా ఉండే తెల్లని పౌడర్ అది అతి మృదువుగా మీ చిగుళ్ళను తోముతుంది. అంతేగాకుండా దానిలో ఉండే సున్నితమైన మెరుగునిచ్చే పదార్థం మీ పళ్ళ మీది పాచిపొరలను తొలగిస్తుంది. మీ పళ్ళను శుభ్రపరచి తెల్లగా చేస్తుంది. కోల్గేట్‌లోని పుష్కలమైన నురుగునిచ్చే చర్య పళ్ళ సందులలోనికి చొచ్చుకుపోయి చెడు వాసనను దంతక్షయకారకములైన సూక్ష్మ క్రిములను తొలగిస్తుంది.
మీ కుటుంబానికి కోల్గేట్ టూత్ పౌడర్‌తో అధునాతనమైన తీరులో దంతరక్షణ సమకూర్చండి. దానియొక్క చల్లని, పిప్పరమెంట్ రుచిని వారంతా మెచ్చుకుంటారు.

TP.G.30TL

రావాలి'' అని కోరుకుంటూ ఎదురుగా ఉన్న దేవుడి గుడి చెంతకు చేరాడు బాచిగాడు. గుడి చుట్టూ తిరిగాడు. తనకు లేని దేదో ఎదుటివాడు అనుభవించటం చూసి బాధపడే నైజం మనిషిది. ఆశ పిడికెడే. కానీ, అది నిండటానికి సముద్రమైనా చాలదు. బాచిగాడు కూడా ఎదుగుతున్న మనిషే. ఆ ఆశల ఆరాటంతో వాడి గుండె సైతం స్పందించింది.

"భగవంతుడా! రేపు దీపాలినాడు వర్షం రావాలి. ఈ దీపాలి ఉత్తుత్త దీపాలి అవ్వాలి. భగవంతుడా!" గుడి చుట్టూ తిరిగి దేవుని వేడుకొన్నాడు బాచిగాడు. జీవుడి రోదన దేవుడికి వినిపించిందిలా ఉంది. ఆ తుంపర కొనసాగుతూనే ఉంది.

అప్పటివరకూ సన్న సన్నగా పడ్డ తుంపర ఆగిపోయింది. గుడిసె చూరుకింద ఆకాశం దిక్కుకే దిగాలుపడి చూస్తూ కూర్చుని ఉన్న బాచిగాడి కళ్ళు ఒక్కసారిగా విప్పారినాయి. పట్వారీ దొర కొడుకూ, పటేల్ దొర కొడుకూ తన ఇంటి వైపే వస్తున్నారు. ఒక్క గెంతు గెంతి వాళ్ళను చేరుకున్నాడు బాచిగాడు.

"గిటువే పోతున్నరు. ఎవరికాడికి పోతాన్రు?" ప్రశ్నించాడు బాచిగాడు.

"నీకోసమేరా." పట్వారీ దొర కొడుకు సమాధానమిచ్చాడు. నమ్మలేనట్లు చూశాడు బాచిగాడు. వాడి కనుపాపలు మిలమిలలాడాయి.

"ఇవి తీస్కో. రేపు దీపావళికి నీవు కాల్చుకో" అంటూ మందు టపాకాయలున్న సంచీని బాచిగాడికి అందించబోయాడు పటేల్ దొర కొడుకు. ఉలుకూ పలుకూ లేకుండా ఆ సంచీ నందుకొన్నాడు బాచిగాడు. అన్ని వ్యథల్నీ పీల్చుకొన్న బ్లాటింగ్ పేపరులా తేలికయింది వాడి మనసు.

"గివన్నీ నాకే?!" సందేహిస్తూనే అడిగాడు బాచిగాడు.

"అవున్రా, బాచి. నిన్న స్కూల్లో చెప్తివిగండ నీకూ టపాసులు కాల్చాలని ఉందనీ, మీ అయ్య తేడనీ? మాకాడ ఎక్కువున్నై. కొన్ని నీకూ తెచ్చాం. స్కూల్లో మన ముగ్గురం జట్టుగా ఉన్నాం. ఈ టపాసుల్లోనూ అట్లాగే ఉందాం." పటేల్ దొర కొడుకు విశదీకరించాడు.

ఉక్కిరి బిక్కిరై పోతూ నోటంట మాటే రాని స్థితిలో ఉండిపోయాడు బాచిగాడు. రోజూ చూసేదే అయినా, గగనం వాడికి గహనతరంగా ఉండిపోయింది. కొన ప్రాణంతో మిగిలి ఉన్న నిజాయితీ మ్యూజియం నుండి బయటికి వచ్చి విశ్వరూప సందర్శనంతో వాడిముందు నిలబడ్డట్లు అయింది. పట్వారీ దొర కొడుకూ, పటేల్ దొర కొడుకూ వెనుదిరిగారు.

బాచిగాడి చేతిలోని సంచీనిండా మందు టపాసులు. వాడు కలలు కనీ కనీ తపించి పోయిన దానికి ఫలితంగా అందిన వరాలు. వాడి మనసులో ఏదో మూల బాధ కలుక్కుమంది. ఎంతో అపచారం చేసినట్లు భీతితో అల్లాడిపోయాడు. ఇంట్లోకి వెళ్ళి సంచీని ఒక మూల భద్రంగా ఉంచాడు.

"వో లమ్మో! ఈట్నే జర సూత్తుండవే. నా నిప్పుడే వత్తా." తల్లికి చెపుతూనే బయటికి పరుగెత్తాడు బాచిగాడు. ఆ పరుగుతోనే దేవాలయం దగ్గరికి వచ్చాడు. బెదురు బెదురుగా గుడి గోపురం కేసి చూశాడు. సిగ్గు సిగ్గుగా చూశాడు అపరాధం చేసినట్లు.

"భగవంతుడా! తప్పు చేసిన. వర్షం రావాలని నిన్ను కోరిన. వర్షం వద్దు. వద్దే వద్దు. రేపు దీపాలి మా జోరుగ జర్గిపోవాలి. పట్వారీ దొర కొడుకు, పటేల్ దొర కొడుకు మంచిగా టపాసులు పేల్చుకోవాలి. నేమా గంతే మరి. భగవంతుడా! నన్ను క్షమించు. వర్షం వద్దు రేపు. ఎలాగే ఉండాలి. రేపటేల్లా ఎలాగే ఉండాలి" అంటూ గుడిచుట్టూ ఆత్రంగా తిరిగాడు బాచిగాడు. వేడుకొని వేడుకొని వెనుదిరిగాడు బాచిగాడు. నడుస్తూ నడుస్తూ ఆకాశం వైపు చూశాడు. నిర్మలంగా ఉంది. మళ్ళీ తుంపర వచ్చే లక్షణాలు లేవు. సూర్యుడు అస్తమించబోతూ ఆకారం పెద్దది చేశాడు, ఆఖరి దర్శనమిస్తున్నట్లుగా. సూర్యుని వైపే క్షణకాలం రెప్ప వాల్చకుండా చూశాడు బాచిగాడు.

"సూరీడా! రేపిట్లనే ఎలగాలి నీవు. వర్షంరానీకు." మొక్కుకొన్నాడు బాచిగాడు.

చీకటి పడింది. ఆదరా బాదరా ఇంత తిని పక్క మీదికి చేరాడు బాచిగాడు. ఆ సంచీని పక్కనే పెట్టుకొన్నాడు. ఆ సంచీయే తన ప్రాణమున్నట్లుగా కడుపులో దాచుకున్నాడు. రాత్రి గడిచిపోయింది. వెలుగు పరుచుకొంది. ఆ రోజే దీపావళి. బాచిగాడికి ఏవేవో లోకాల్లో తేలిపోతున్నట్లుగా ఉంది. ఈ భూమి, ఈ మనుషులు, ఈ పరిసరాలు వాడి చూపుకి నవనవల్లా తోచినాయి. ఇముడ్చుకోలేని ఆనందంతో బయటికి వచ్చాడు బాచిగాడు. వీథులన్నీ తిరిగాడు. అలుపొచ్చేంతవరకూ తిరిగాడు. దీపావళి సరుకులమ్మే దుకాణాల చుట్టూ చుట్టుముట్టుకు తిరిగాడు.

'వోవ్! గివన్నీ నా కుతా ఉన్నై' అనుకొంటూ తిరిగాడు.

తిరిగి తిరిగి ఇంటికొచ్చిన బాచిగాడు దిక్కులు పిక్కటిల్లేటట్లు ఒక గావుకేక పెట్టాడు. శరీరాని కెక్కడో రంధ్రం పడి ప్రాణం పోతున్నట్లు విలవిల్లాడాడు. వాడి ఆరవ ప్రాణమైన దీపావళి సామాను కాని, ఆ సామాను ఉంచిన సంచీ కాని ఇల్లంతా గాలించినా కనిపించలేదు.

బాచిగాడి పర్యల్ని జాలిగా, దీనంగా చూస్తున్న తల్లి ఇక తప్పదన్నట్లుగా నోరు విప్పింది.

"మీ అయ్య వచ్చినోడు. ఆ టపాసు లెట్టకెళ్ళి దీపాలి దుకాణం కాడ మలిక్కో అమ్మి, ఆ పైసలెట్ట కల్లు తాగొచ్చిండురా. నీ అవస్త చూత్తుంటె నా గుండె చెక్కలై పోతాంది. ఆడి తాగుడు సచ్చిపోను."

బాచిగాడి కళ్ళముందు చీకటి తెరలు తెరలుగా అల్లుకుపోయింది. తల్లినుండి వచ్చిన ఆ గుప్పెడు సానుభూతితో వాడి గుండె గుట్టుగా రోదించింది. ఆ రోదనలో, ఆ చీకటిలో దేవ, తండ్రి, పట్వారీ దొర కొడుకు, పటేల్ దొర కొడుకు, గుడి భూతమంత రూపాలెత్తి దర్శన మిస్తున్నాయి వాడికి. వాడు పరవశించటానికి ఏ అనుభూతుల చక్కిలిగింతలూ మిగలలేదు. దారిద్ర్యపు రుగ్మతలనుండి ముక్తి చెందటానికి వలసపడని బొగ్గుతో రూపం దిద్దిన బొమ్మలాంటి జీవితం వాడిది. ఆ జీవితానికి ఏ అంతర్జాతీయ పరిగణనా ఉండదు. అసలు పట్టింపే ఉండని, కాలం విసిరేసిన ఖాళీ సంచీ వంటి అస్తిత్వం వాడిది. ఆ కాలం కాడి క్రిందే బాచిగాని మెడ.

★

